

ఆక్రమణకు గురైన మురాద్‌బీ కుంట

జిల్లాలో ప్రశాంతంగా 'టెట్'



సాయి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 27: ఉపాధ్యాయ పోస్టుల కోసం డీఎస్సీ రాయబోయే అభ్యర్థులు ముందుగా ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష రాయాల్సి ఉంది. ఇందులో భాగంగానే అటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఇటు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న టీటీసీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ మంగళవారం నుంచి మార్చి 6వ తేదీ బుధవారం వరకు 9 రోజుల పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు హాజరు కానున్నారు. ఇందులో భాగంగానే విద్యా శాఖాధికారులు రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే మంగళవారం మొదటిరోజు ఉదయం జరిగిన సెక్షన్-1 పరీక్షకు 645 మందికి గానూ 465 మంది హాజరుకాగా 180 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్-2 పరీక్షకు 595 మందికి గానూ 483 మందికి హాజరుకాగా 112 మంది గైర్హాజరయ్యారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి రాయచోటి పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, రాజంపేట పట్టణంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

బాలసుబ్రమణ్యంకు పచ్చజెండా

● ప్రచారం చేసుకోమని స్పష్టతనిచ్చిన చంద్రబాబు



చంద్రబాబుతో బాలసుబ్రమణ్యం

రాయచోటి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పార్లమెంటు స్థానానికి టీడీపీ అభ్యర్థిగా ఉమ్మడి కడప జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యంకు టీడీపీ అధినేత చంద్రబాబు పచ్చజెండా ఊపారు. మంగళవారం సాయంత్రం ఆయన విజయవాడలో చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు టీడీపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి ప్రచారం చేసుకోమని సూచించినట్లు తెలిసింది. రాజంపేట పార్లమెంటు పరిధిలో ఇప్పటికే టీడీపీ పరిస్థితి చాలా బాగుందని, అందరినీ కలుపుకుని ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించినట్లు తెలిసింది. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడైన బాలసుబ్రమణ్యం రెండు పర్యాయాలు రాయచోటి జడ్పీటీసీగా పనిచేశారు. ఉమ్మడి కడప జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్, ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. రెండు నెలల కిందట బాలసుబ్రమణ్యం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. అప్పటి నుంచి బాలసుబ్రమణ్యం పార్లమెంటు పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో పర్యటిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులను కలిసి మద్దతు కోరుతూ వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా నాయకుల నుంచి విశేషస్పందన వస్తున్నట్లు బాలసుబ్రమణ్యం తెలిపారు. వైసీపీ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువగా ఉందని గెలుపు సాధిస్తామని అన్నారు. జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు అందరినీ కలుపుకుని ముందుకు వెళతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

డీకేటీనే కదా...
వేసెయ్ వెంచర్



● గుర్రంకొండలో డీకేటీ భూముల కబ్జా
● ఎకరాల్లో వెంచర్లు... కన్వర్షన్ ఎక్కడ
● 3.34 ఎకరాల మురాద్‌బీకుంట కబ్జా
● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, ఫిబ్రవరి 27: గుర్రంకొండ పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. డీకేటీ భూమి కనబడితే చాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్కడ వాలిపోయి కబ్జా చేయడం లేదా తక్కువ ధరకు కొనుగోలు చేసి వెంచర్లు వేసి అమాయకులకు అమ్మేస్తున్నారు. డీకేటీ భూములు కొనడం, అమ్మడం చేయకూడదన్న నిబంధనలున్నా అవేమీ వీరు పట్టించుకోవడం లేదు. వ్యవసాయ భూములను కూడా కన్వర్షన్ చేయకుండా వెంచర్లు వేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గుర్రంకొండ పట్టణంలో పట్టా భూములు చాలా తక్కువగా ఉన్నాయి. పట్టణం నుంచి మదనపల్లె మార్గంలో చాలా వరకు పురావస్తుశాఖ ఆధీనంలో ఉన్న భూములు ఉన్నాయి. అలాగే పట్టణం నుంచి రాయచోటి మార్గంలో ఎక్కువ భాగం డీకేటీ భూములే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుర్రంకొండ పట్టణంలో సెంటు స్థలం లక్షల రూపాయలు పలుకుతోంది. పట్టణం మధ్యలో కుంట స్థలం కోటి రూపాయలు పలుకుతోంది. పట్టణంలో ఇంటి స్థలాన్ని సామాన్యులు కొనే పరిస్థితి లేదు. ఇదే అదునుగా భావించి రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టణం చుట్టూ ఉన్న డీకేటీ భూములను కొనుగోలు చేస్తున్నారు. అందులో వెంచర్లను వేసి లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. డీకేటీ భూములను ఇష్టానుసారంగా అమ్మేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుర్రంకొండ పట్టణానికి సమీపంలోని మార్కెట్ యార్డు వద్ద చుట్టూ డీకేటీ భూములు అధికంగా ఉన్నాయి. ఈ భూములు కూడా జాతీయ రహదారి పక్కనే ఉండడం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కాసుల పంట కురిపిస్తోంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో అటు మదనపల్లె, ఇటు వాల్మీకిపురాన్ని కలుపుతూ రోడ్డు మార్గాలున్నాయి. దీంతో ఇక్కడ జనసంచారం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా హోటల్‌లు, టీ దుకాణాలు అర్ధరాత్రి వరకు వ్యాపారాలు జరుగుతాయి. ఇదే అదునుగా భావించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు డీకేటీ భూములను తక్కువ ధరకు కొనగోలు చేశారు. ఇందులో భాగంగా గుర్రంకొండ, ఖండ్రిగ రెవెన్యూ గ్రామాల్లోని రోడ్డుకు పక్కనున్న కొన్ని సర్వే నెంబర్లలోని భూములను కొనుగోలు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన గుర్రంకొండ రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నెంబరు 503/7, ఖండ్రిగ రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నెంబర్లు 15/4, 15/5లో డీకేటీ, చుక్కల భూముల జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సర్వే నెంబర్లు డీకేటీ నుంచి పట్టా భూములుగా మారే జాబితాలో ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ సర్వే నెంబర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాలేదని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కాకనే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూముల్లో వెంచర్లు వేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం.


డీకేటీ భూముల్లో వెంచర్లను అడ్డుకుంటాం

- వెంకటస్వామి, ఆర్ఎస్‌డీటీ, గుర్రంకొండ.

గుర్రంకొండ పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు డీకేటీ భూముల్లో వెంచర్లు వేయకూడదు. డీకేటీ భూములో వెంచర్లు వేయడం చట్టరీత్యా నేరం. పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద వేస్తున్న వెంచర్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. అక్రమంగా వెంచర్లు వేసి ఉంటే వాటిని నిలుపుదల చేస్తాం.

కబ్జా కోరల్లో కుంట...

ఖండ్రిగ రెవెన్యూ గ్రామం పరిధిలో మురాద్‌బీ కుంట ఉంది. సర్వే నెంబరు 16/1లో 3.34 ఎకరాలు మురాద్‌బీకుంట ఉంది. ఈ కుంటను కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించుకున్నారు. ఇందులో కొందరు వ్యవసాయం చేసుకోగా కొంత స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించుకున్నారు. వర్షం కురిస్తే ఈ కుంటకు నీరు వచ్చే అవకాశం లేకుండా వంకను సైతం పూర్తిగా అక్రమించేశారు. దీంతో కుంటకు నీరు చేరే మార్గం లేదు. ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వంకలు, వాగులు, డీకేటీ భూములను అక్రమించుకుని లక్షలు గడిస్తున్నారు.



మార్కెట్ యార్డు వద్ద డీకేటీ భూమిలో వేస్తున్న వెంచర్

రాయచోటిలో టీడీపీ జెండా ఎగరాలి



చంద్రబాబు ఎదుట చేయి చేయి కలిపిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు

● మండిపల్లి, ప్రసాద్‌బాబులతో చంద్రబాబు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 27: రాయచోటిలో టీడీపీ జెండా ఎగరాలని, ఇరు కుటుంబాల వారు సమష్టిగా పనిచేసి గెలిచి తీరాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబులకు తెలిపారు. చంద్రబాబునాయుడును మంగళవారం విజయవాడలోని టీడీపీ కేంద్ర పార్టీ కార్యాలయంలో టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు ఎదుట వారిద్దరూ చేయి చేయి కలిపారు. రాయచోటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఎంపిక చేశామని సుగవాసి కుటుంబం సమిష్టి కృషితో రాంప్రసాద్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని సూచించారు. ఇరుకుటుంబాలు సమన్వయంతో ముందుకెళ్లాలని, విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని సుగవాసి ప్రసాద్‌బాబుకు హామీ ఇచ్చారు.

వైసీపీ రాజకీయాలకు క్రికెటర్‌ను బలి చేశారు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

● జగన్‌రెడ్డి రాజకీయ లబ్ధికే ఆడుదాం ఆంధ్ర
● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


రాయచోటిటౌన్, ఫిబ్రవరి 27: వైసీపీ క్రీడా రాజకీయాలకు ఆంధ్ర రంజీ క్రీడారుడు విహారిని బలి చేశారని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆరోపించారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలో టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ అరాచకాలు, రాజకీయ రాక్షస క్రీడలతో మన రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారులను సైతం బలి చేస్తున్నారని విమర్శించారు. ఆంధ్ర రంజీ జట్టుకి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హనుమ విహారి కూడా ఈ ప్రభుత్వ అరాచకాలు భరించలేక రాజీనామా చేస్తున్నానని చెప్పి భవిష్యత్తులో కూడా నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఆడనని చెప్పి బహిరంగంగా సోషల్ మీడియాతో పోస్టు పెట్టారంటే ఈ సైకో ప్రభుత్వం చివరికి క్రీడాకారులను కూడా వదలడం లేదనడానికి ఇది ఒక నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో క్రీడాకారులను ప్రోత్సహించిన పాపాన పోలేదన్నారు. వైసీపీ నాయకుడి కుమారుడి కోసం హనుమ విహారి లాంటి ఒక ఉత్తమ క్రీడాకారుడిని తొలగించడం అన్యాయమన్నారు. జగన్‌రెడ్డి పరిపాలనలో క్రీడా వ్యవస్థను నీరుగార్చారని, క్రీడాభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. హనుమ విహారిపై వైసీపీ నేతల వ్యాఖ్యలు అర్థరహితమని, తక్షణమే క్షమాపణలు చెప్పి అతడికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించి రాష్ట్ర క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర యువతలో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువైందని గమనించిన ముఖ్యమంత్రి జగన్ రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఆడుదాం-ఆంధ్ర పేరుతో సరికొత్త ప్రచార ఆర్భాటం చేశారన్నారు. అందులోనూ నాసిరకం క్రీడా వస్తువులను ఉపయోగించారని ఆయన విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం క్రీడాకారుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను దిగజార్చుతున్నారన్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న వికృత చేష్టలకు ఉత్తమ క్రీడాకారులు కూడా పొరుగు రాష్ట్రాలకు వలసపోయే పరిస్థితులు తీసుకొచ్చారని ఆరోపించారు. ఇప్పటికే పెట్టుబడులను పొరుగు రాష్ట్రాలకు తరిమేసి ఇక్కడ నిరుద్యోగం పెంచారన్నారు. సమావేశంలో వీరబల్లి మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, టీడీపీ నేతలు నాగభూషణంనాయుడు, రాజానాయుడు, బాలకృష్ణ, దుర్గం ఆంజనేయులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27: సమాన పనికి సమాన వేతనంలో జరిగిన లోటుపాట్లకు సంబంధించిన వాటిని పరిష్కరించాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను హైదరాబాదులో కలిసినట్లు పోరాట కమిటీ జేఏసీ నాయకులు తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వద్ద కార్మికులకు సంబంధించిన చర్చలు జరిపినట్లు తెలిపారు. సమావేశానికి ఏపీఎండీసీ యాజమాన్యం చర్చలకు రాలేదని, మార్చి 9వ తేదీ యూనియన్స్‌తో జరిగే చర్చలలో సమస్య పరిష్కారం అవుతుందని లేబర్ కమిషనర్‌కి తెలియజేశారన్నారు. ఇందుకు లేబర్ కమిషనర్ 14వ తేదీకి చర్చలు వాయిదా వేశారని తెలిపారు. ఈ చర్చలలోనే రిటైర్మెంట్ అయిన కార్మికులకు గ్రాట్యూటీ అమౌంట్ చెల్లించాలని లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ఇంటిని జరుపుతున్నారు..!

● 150కిపైగా జాకీలు అమర్చి జర్మన్ టెక్నాలజీతో ఇంటి తరలింపు ● జాతీయ రహదారి విస్తరణలో ఇల్లు పడగొట్టకుండా యజమాని నిర్ణయం




బురకాయలకోట బైపాస్ రోడ్డు మలుపులో ఉన్న ఇల్లు



ఇంటిని ముందుకు జరిపేందుకు కింద ఉంచిన జాకీలు

ములకలచెరువు, ఫిబ్రవరి 27: మీరు విన్నది నిజమే.. ఇంటిని జాకీల సహాయంతో ముందుకు జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనికోసం జర్మన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. రేపటి నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు చెన్నైకి చెందిన లిఫ్టింగ్, షిఫ్టింగ్ సంస్థ ఈ పనులు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇల్లు పడగొట్టకుండా యజమాని ఈ నిర్ణయం తీసుకుని అమలు పరుస్తున్నాడు. వివరాల్లోకి వెళితే... ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ మార్కీరివారిపల్లెకు చెందిన బి.రామక్రిష్టారెడ్డి బురకాయలకోటలో స్థలం కొనుగోలు చేసి మూడంతస్థుల ఇంటిని నిర్మించారు. స్థలం కొనుగోలుతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.కోటి వరకు ఖర్చు వచ్చింది. ఆరు నెలల క్రితం ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశం చేశారు. ఈ తరుణంలో ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఉన్న ముంబాయి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా జరుగతున్నాయి. బురకాయలకోటకు బైపాస్ రోడ్డు మంజూరై పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. బైపాస్ రోడ్డు వెళ్లే మలుపులో ఇల్లు అడ్డం వచ్చింది. దీంతో ఇంటికి ఆనుకుని రోడ్డు వేశారు. ఇక్కడ మరి కొంత భాగం రోడ్డు వేయాల్సి ఉంది. రోడ్డుకు అడ్డుగా ఉన్న ఇల్లు పడగొట్టడానికి నష్టపరిహారం మంజూరైంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.84.56 లక్షలు ఇంటి యజమాని ఖాతాలో జమ చేసింది. ఎంతో ఆశతో కట్టుకున్న ఇల్లు పడగొట్టేందుకు మనసొప్పలేదు. దీంతో ఇంటి యజమాని రామకృష్టారెడ్డి తెలిసిన వారి సూచనల మేరకు చెన్నైకి చెందిన జేజే బాబు లిఫ్టింగ్, షిఫ్టింగ్ సంస్థను సంప్రదించాడు. జర్మన్ సాంకేతికతో ఇంటికి ఎలాంటి నష్టం జరగకుండా ఎంత దూరమైనా ముందుకు తీసుకెళ్లి యధాతధంగా పెట్టవచ్చని సంస్థ యజమాని చెప్పడంతో ఇంటి యజమాని అంగీకరించి రూ.15 లక్షలు చెల్లించేందుకు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముందుకు జరిపేందుకు ఇంటి ముందు ఖాళీగా ఉన్న కుంట స్థలాన్ని రూ.16 లక్షలు పెట్టి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో చెన్నైకి చెందిన సంస్థ సిబ్బంది తొలి దశ పనులు ప్రారంభించారు. దీనికి గానూ ఇంటి చుట్టూ గొయ్యి తవ్వి గోడలు, బీమ్‌ల కింద భారీ జాకీలు అమర్చి కొంచెం కొంచెంగా పైకి లేపుతూ వచ్చారు. ఎక్కడా పగుళ్లు రాకుండా జాగ్రత్తగా మూడు అడుగులుపైకి లేపారు. వారం రోజులుగా జరుగుతున్న జాకీలు అమర్చే పనులు పూర్తయ్యాయి. దీనికి గానూ 150కి పైగా జాకీలు వినియోగించారు. గురువారం నుంచి ఇంటిని ముందుకు జరిపే పనులు ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజూ ఐదు మీటర్ల చొప్పున భవనాన్ని ముందుకు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 150 అడుగుల దూరం పాటు ముందుకు జరిపి భవనాన్ని పెట్టేందుకు ఖాళీ స్థలంలో బేస్‌మెంట్ వేసి సిద్ధం చేస్తున్నారు.

జాగ్రత్తగా ఇంటిని ముందుకు జరుపుతాం..



జర్మన్ టెక్నాలజీతో ఇంటికి ఎలాంటి పగుళ్లు, నష్టం జరగకుండా జాగ్రత్తగా ముందుకు జరుపుతాం. దీనికి 150 జాకీలు వాడుతున్నాం. 150 అడుగులు ముందుకు జరుపుతాం. రోజుకు ఐదు మీటర్లు ముందుకు జరిపేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నాం. ఏడాది క్రితం చిత్తూరులో ఇలాగే ఓ ఇంటిని జర్మన్ టెక్నాలజీతో 200 అడుగులు ముందుకు జరిపాం. ఇక్కడ కూడా అన్ని జాగ్రత్తలు తీసుకుని భవనాన్ని ముందుకు జరిపేందుకు జాకీలు అమర్చాము. గురువారం నుంచి భవనాన్ని ముందుకు జరిపే పనులు ప్రారంభిస్తాం.

- బాబు, లిఫ్టింగ్, షిఫ్టింగ్ సంస్థ యజమాని, చెన్నై.

ఎంతో ఆశగా ఇల్లు కట్టుకుంటే పడగొడతామన్నారు..



ఎంతో ఆశగా ఇల్లు కట్టుకుంటే రోడ్డు విస్తరణలో భాగంగా పడగొడతామన్నారు. బాధలు, అగచాట్లు పడి అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నాం. ఆడపిల్లల పెళ్లి కోసం కట్టుకున్న ఇల్లు పడగొతామంటే చాలా బాధేసింది. ఇంటిని ముందుకు జరిపేందుకు ముందున్న స్థలాన్ని కొనుగోలు చేశాం. చెన్నైకి చెందిన నిపుణుల సహాయంతో ఇంటిని ముందుకు జరుపుతున్నాం. ఇంటికి ఎలాంటి నష్టం వాటిల్లకూడదని దేవుడిని ప్రతిరోజూ వేడుకుంటున్నాం.

- రామక్రిష్ణారెడ్డి, ఇంటి యజమాని, బురకాయలకోట, ములకలచెరువు మండలం

తండ్రి చేతిలో తనయుడు హతం

మద్యానికి బానిసై తల్లిదండ్రులకు వేధింపులు.. భరించలేకే హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ పార్థసారథి

చెన్నూరు, ఫిబ్రవరి 27 : మద్యానికి బానిసైన కొడుకు తండ్రిని చంపబోగా భయపడ్డ తండ్రి కొడుకునే హతమార్చిన సంఘటన మండలంలోని కొండపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. చెన్నూరు పోలీసుల వివరాలు, గ్రామ వీఆర్వో నిర్మల సమాచారం మేరకు... కొండపేటకు చెందిన ఉండేల చిన్నరామిరెడ్డి కుమారుడు ఓబుల్‌రెడ్డి (39) మద్యానికి బానిసయ్యాడు. పదేళ్ల క్రితం ఓబుల్‌రెడ్డికి వివాహమైంది. ఓబుల్‌రెడ్డి విపరీతంగా మద్యం తాగుతుండటంతో పెళ్లయిన ఏడాదికే భర్తను వదిలి భార్య పుట్టింటికి వెళ్లింది. అయినా ఓబుల్‌రెడ్డి మద్యం తాగడం మానేయలేదు. మద్యం అతిగా తాగి వచ్చి తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం విపరీతంగా మద్యం తాగి తండ్రిపై దాడి చేశాడు. ఆయనను కొట్టి గొంతుపై కాలు పెట్టి తొక్కగా, ఆయన ఎలాగోలా తప్పించుకుని బయటపడ్డాడు. కాగా మంగళవారం మళ్లీ మద్యం తాగి ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. మద్యానికి డబ్బు ఇవ్వాలని తల్లిదండ్రులను వేధించడంతో అతడి తల్లి బ్యాంకుకు వెళ్లి డబ్బు తెస్తానని చెప్పి బయటికి పోయింది. కాగా ఇంట్లో ఉన్న తండ్రితో మళ్లీ గొడవ పడి దాడి చేయబోగా ఆయన తనను చంపుతాడేమోననే భయంతో ఇంట్లో ఉన్న రోకలిబడె తీసుకుని కొడుకు తలపై మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కలవారికి తెలియడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామ వీఆర్వో నిర్మల హత్య జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. సీఐ పార్థసారథి హత్య జరిగిన ప్రదేశానికి చేరుకుని ఓబుల్‌రెడ్డి తండ్రిని విచారించారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం అతడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 27: ఎర్రగుంట్ల వినాయకనగర్ సచివాలయం సమీపంలో ఆర్‌వోబీ కింద 60 ఏళ్ల వృద్ధుడు మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఉదయం నుంచి బ్రిడ్జి కింద పడిపోయి ఉన్నాడు. అయితే అతను మద్యం మత్తులో ఉన్నాడని ఎవరూ పట్టించుకోలేదు. అయితే సాయంత్రం వరకు అలాగే పడి ఉండటంతో స్థానికులు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది పరీక్షలు నిర్వహించి మృతిచెందినట్లు తెలిపారు. అయితే వృద్ధుడు ఎర్రగుంట్ల ప్రాంతానికే చెందినవాడుగా చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 27: మండలంలోని మాచునూరు రెవెన్యూ పొలంలో ఉన్న ఐరన్ ఓర్ మైన్‌లో మంగళవారం విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న పంగా పెద్ద గంగన్న (40) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... స్తంభంపై విద్యుత్ మరమ్మతులు చేస్తున్న పెద్ద గంగన్న షాక్ తగిలి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం కడపకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడింది. గంగన్న స్వగ్రామం గోపరాజుపల్లెలో విషాదచాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



లావణ్య (ఫైల్)

సీకేదిన్నె, ఫిబ్రవరి 27: అనుమానాస్పద స్థితిలో బి.లావణ్య (20) మృతిచెందినట్లు ఎఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... గాలివీడు మండలం వడిశలంక గ్రామానికి చెందిన గణేష్‌రెడ్డికి శ్రీకాకుళం జిల్లా ఇద్దిగాని పాళెంకు చెందిన లావణ్యకు నెల రోజుల క్రితం వివాహమైంది. వీరిరువురు మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో నివాసం ఉండేవారు. గణేష్‌రెడ్డి ఓ ప్రైవేటు స్కూలులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండేవాడు. ఏమైందో ఏమోగాని మంగళవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరు లేని సమయంలో లావణ్య ఉరి వేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంసీఎంసీ కమిటీలు కీలకపాత్ర పోషిస్తాయి



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ గుర్రప్ప

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 27: ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీలు ఎన్నికల్లో కీలకపాత్ర పోషిస్తాయని మాస్టర్ ట్రైనర్ గుర్రప్ప తెలిపారు. మంగళవారం స్థానిక రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ, ఎంసీఎంసీ కమిటీల్లో పనిచేయబోయే అధికారులు, సిబ్బందికి నోడల్ అధికారి (శిక్షణ) ధనలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రప్ప మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు గరిష్ఠ పరిమితిని ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తుందన్నారు. ప్రతి అభ్యర్థి ఖర్చులను వ్యయ పర్యవేక్షణ కమిటీ నిశితంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ గురించి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలను తమ ప్రచారాలకు వాడుకుంటారన్నారు. ఎన్నికల సమయంలో మీడియాను పర్యవేక్షించి స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ఎంసీఎంసీ కమిటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి నాగరాజు, జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గాల ఆడిట్ అధికారులు, సమాచార, పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకర బర్డ్‌ఫ్లూ వైరస్‌ను కట్టడి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ గుణశేఖర్ పిళ్లై

చిట్వేలి, ఫిబ్రవరి 27 : జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదకర బర్డ్‌ఫ్లూ వైరస్‌ను కట్టడి చేద్దామని పశు వైద్య శాఖ జేడీ డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. మంగళవారం స్థానిక ఏరియా పశు వైద్యశాలలో జరిగిన బర్డ్‌ఫ్లూ వైరస్ నిరోధక సంయుక్త సమావేశంలో ఆయన ఉమ్మడి కడప జిల్లా పశువ్యాధుల నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాంతక బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలకుండా తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి వివరించారు. వైరస్‌ను నిరోధించడానికి ఉమ్మడి కడప జిల్లా యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకుంటుందన్నారు. అన్నమయ్య జిల్లాలో 36 లక్షల కోళ్లు ఉన్నాయని, రైతులు వైద్యులు సూచించిన జాగ్రత్తలు తీసుకుంటే వాటికి ప్రమాదం ఉండదన్నారు.

అపోహలను వ్యాప్తి చేయొద్దని సూచించారు. నెల్లూరు జిల్లా నుంచి కోళ్లు, గుడ్లు, దాణాను నిషేధించామన్నారు. వైరస్ 60 డిగ్రీల వేడిలో చనిపోతుందని, భారతీయ వంటలు దాదాపు 100 డిగ్రీల పైబడి వేడిలో వండుతారు కాబట్టి వైరస్ చనిపోతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందని ప్రజలు భయపడాల్సిన పనిలేదన్నారు. అలాగే నెల్లూరు, ఉమ్మడి కడప జిల్లాల సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. పశు కిసాన్ కార్డులను అత్యధికంగా సేకరించిన ఆరోగ్య మిత్ర వెంకటసుబ్బయ్యను జేడీ అభినందించారు. కార్యక్రమంలో ఏరియా పశువైద్యశాల ఏడీ కె.డి.వరప్రసాద్, డాక్టర్ భువనేశ్వరి, ఆరోగ్య మిత్రలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

వ్యక్తిపై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 27 : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో మహబూబ్‌నగర్ కాలనీలో 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని రమణరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ కాలనీలో తనిఖీలు చేయగా రమణరావు అనే వ్యక్తి వద్ద 15 మద్యం సీసాలు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


భక్తులకు తప్పని తిప్పలు

- అధ్వానంగా నిత్యపూజస్వామి కోన రహదారి
- దుమ్ముతో వాహనదారుల అవస్థలు
- చెత్తాచెదారంతో నిండిపోయిన కోనేరు

సిద్దవటం, ఫిబ్రవరి 27 : మండలంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజస్వామి కోనకు వెళ్లే భక్తులకు తిప్పలు తప్పడం లేదు. కోనకు వెళ్లే దారి అధ్వానంగా ఉండటంతో ముందు ఏదైన వాహనం వెళ్లిందంటే వెనుక ఉన్న వారికి దుమ్ము రేగడంతో దారి కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా లింగాల వద్ద తాగునీటి కోనేరు ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదాంతో అపరిశుభ్రంగా మారింది. ఇలాంటి అపరిశుభ్రమైన నీరు తాగాలంటే ఇబ్బందులు పడుతున్నామని భక్తులు పేర్కొంటున్నారు. శివరాత్రి దగ్గర పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమని భక్తులు వాపోతనాన్నరు. నిత్యపూజస్వామి దేవస్థానం అభివృద్ధి ఏమాత్రం జరగలేదని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఈ విషయంపై ఆలయ చైర్మన్ కొండారెడ్డిని వివరణ కోరగా ఎండోమెంటు శాఖ వారు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని, నిత్యపూజేశ్వరకోనలో వేంపల్లికి చెందిన భక్తుడు ఆలయం చుట్టూ కటాంజనం సమకూర్చాడని తెలిపారు. అలాగే ఆలయం గర్భగుడిలో గ్రానైట్ పనులు కడపకు చెందిన శివ భక్తుడు పనులు చేయించి అభివృద్ధికి నాంది పలికారని ఎండోమెంటు శాఖ తరపున ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు లేవని పేర్కొన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో జిల్లా అధికారులతో జరిగే సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడిస్తానని చైర్మన్ తెలిపారు. భక్తులు వెళుతున్న వాహనాలను సిద్దవటంలో ఆపివేయడం వల్ల స్వామి భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో శివభక్తుల విజ్ఞప్తి మేరకు వాహనాలను ఎక్కడా ఆపకుండా పంచలింగాల కోన వరకు పంపించాలని కోరతామన్నారు. పోలీసులు ఎక్కడపడితే అక్కడే వాహనాలను ఆపడం వల్ల భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఈ విషయాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు.




పంచలింగాల వద్ద అపరిశుభ్రంగా ఉన్న కోనేరు



నిత్యపూజస్వామి దేవస్థాన చైర్మన్ కొండారెడ్డి

కోనకు వెళ్లే ప్రధాన దారిలో రేగుతున్న దుమ్ము



నిత్యపూజస్వామి దర్శనానికి కాలినడకన వెళుతున్న భక్తులు

నిత్యపూజ కోనకు 80 ప్రత్యేక బస్సులు

నిత్యపూజస్వామి కోనకు మహాశివరాత్రి సందర్భంగా 80 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కడప ఆర్టీసీ డిపో మేనేజర్ దినేశ్వర్‌రావు తెలిపారు. ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసేందుకు మంగళవారం ఆయన పార్కింగ్ పాయింట్లు సిద్దవటం ఈద్గా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు కడప నుంచి పంచలింగాల కోనకు చేరుకునేందుకు 80 బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే పంచలింగాల కోన వద్ద ఆర్టీసీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ కన్యాకుమారి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దవటం ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

గండి ఆలయ పనులను పరిశీలించిన కలెక్టర్



గండి ఆలయ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

చక్రాయపేట, ఫిబ్రవరి 27: గండి క్షేత్రంలో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను కలెక్టర్ విజయరామరాజు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. సహాయ కమిషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ కృష్ణతేజ, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వాములు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించి ఆయనకు చిత్రపటాన్ని బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సుమారు రూ.14.50 కోట్లతో జరిగే ఆలయ పనులను పరిశీలించారు. మార్చి 5, 6, 7 తేదీలలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎప్పుడు ప్రారంభించాల్సింది తిరుపతిలోని ఆగమపండితులను అడుగుతామని అర్చకులు తెలిపారు. రాజగోపురం, ఆలయ పనులు అసంపూర్తిగా ఉండడంతో గడువులోపు ప్రారంభానికి కష్టమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, అధికారులు పాల్గొన్నారు.

పొలం కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ

ముగ్గురికి గాయాలు

ఖాజీపేట, ఫిబ్రవరి 27: భూమి విషయమై జరిగిన ఘర్షణలో బయపురెడ్డి, రామమోహన్‌రెడ్డి, రంజిత్‌కుమార్‌రెడ్డికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... కొత్తపేటకు చెందిన గోపాల్‌రెడ్డి కడప-కర్నూలు జాతీయ రహదారి పక్కనే చెముళ్లపల్లెకు చెందిన ఓ మహిళ దగ్గర భూమిని కొని పనులు చేసుకుంటుండగా చెముళ్లపల్లెకు చెందిన పత్తి బయపురెడ్డి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాడు. ఆ పొలం దగ్గరకు వెళ్లి పనులను ఆపాలంటూ వారికి చెప్పడంతో జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

బీఐఎస్ లేని వస్తువులను కొనుగోలు చేయడం నేరం



మాట్లాడుతున్న బీఐఎస్ సంస్థ జాయింట్ డైరెక్టర్ రాకేశ్

కడప (రూరల్) ఫిబ్రవరి 27: గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించి కొనుగోలు చేసే వస్తువులు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్)కు లోబడి ఉండాలని, బీఐఎస్ లేని వస్తువులు కొనుగోలు చేస్తే శిక్షార్హులవుతారని ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తెలిపారు. మంగళవారం జడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో సర్పంచ్‌లకు, పంచాయతీ సెక్రటరీలకు బీఐఎస్ కార్యక్రమాలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా క్వాలిటీ కంట్రోల్ నిబంధనలను అతిక్రమిస్తే బీఐఎస్ యాక్టు ప్రకారం చట్టరీత్యా రూ.2 లక్షల వరకు జరిమానాతో పాటు జైలుశిక్ష ఉంటుందన్నారు. వస్తువుల కొనుగోలులో బీఐఎస్ గుర్తును తప్పక చూసుకోవాలన్నారు. వస్తువుల నాణ్యతను ఎలా గుర్తించాలి, ఒకవేళ క్వాలిటీ వస్తువులు కొనుగోలు చేయకపోతే తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యల గురించి ఆయన తెలిపారు. జిల్లా పంచాయతీ వనుల కేంద్రం ఫ్యాకల్టీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పథకాల అమలులో గ్రామ పంచాయతీలు కీలకపాత్ర వహిస్తున్నాయన్నారు. పథకాల అమలుకు సంబంధించి బీఐఎస్‌కు లోబడి వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. అందుకోసమే ఐదు రోజుల పాటు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు వర్క్‌షాపును చేపట్టి బీఐఎస్ ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వర్క్‌షాపు పరిశీలకుడు రమేశ్, ఫ్యాకల్టీ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే మాపై అక్రమ కేసులు

విలేకరుల సమావేశంలో సీఎం సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, ముక్తియార్



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌నాయుడు, ముక్తియార్, లింగారెడ్డి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 27 : ప్రొద్దుటూరులో వైసీపీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు టీడీపీలో చేరడం జీర్ణించుకోలేక ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది బంగారురెడ్డి మాపై తప్పుడు ఆ రోపణలతో అక్రమంగా కేసు పెట్టించారని టీడీపీ నేత సీఎం సురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ ముక్తియార్ అన్నారు. మంగళవారం అన్నా క్యాంటీన్‌లో ముక్తియార్ విలేకరులతో మాట్లాడుతూ అమీర్ హంజా అనే వ్యక్తి దగ్గర డాక్టర్ గౌస్ కుమారుడు ఫిజియోథెరపిస్టు ఆజాద్ స్థలం కొన్నారన్నారు. స్థలం రిజిస్ట్రేషన్ సమయానికి కొలతలు వేస్తే అది కాలువ పోరంబోకు ప్రభుత్వ స్థలం అని తేలిందన్నారు. దీంతో మాకు ఆ స్థలం వద్దు మా డబ్బులు మాకు ఇప్పించమని తన వద్ద పంచాయితీకి వచ్చారని ముక్తియార్ తెలిపారు. పంచాయితీలో డబ్బులు వెనక్కు ఇస్తామని అమీర్‌హంజా ఒప్పుకున్నారన్నారు. అమీర్ హంజా అన్న తన వాటాకు 7 లక్షల డబ్బులు ఇచ్చాడన్నారు. అమీర్ మాత్రం మూడు లక్షలు ఇచ్చి ఇంకా నాలుగు లక్షలు ఇవ్వకుండా తిప్పుతున్నాడన్నారు. ఇచ్చిన గడువు ముగిసినా పలకడం లేదని డాక్టర్ గౌస్ తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తే అమీర్ హంజాను అన్నాక్యాంటీన్‌కు పిలిపించి మాట్లాడామన్నారు. అతనే స్వయంగా వచ్చాడని తామెవ్వరమూ అతడిని బలవంతంగా తీసుకురాలేదన్నారు. అతడి డబ్బులకుగాను అతడి ఇన్నోవా వాహనం మా దగ్గర పెట్టుకోమని అతడే కారు తాళాలు మాకు ఇచ్చి వెళ్లాడని తెలిపారు. అన్నాక్యాంటీన్‌లో జరిగింది అంతేనని అక్కడి సీసీ కెమెరాలు కూడా పరిశీలించవచ్చన్నారు. కానీ దానిని వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, బంగారురెడ్డి రాజకీయం చేసి అమీర్‌ను వైసీపీలో తిరుగుతుంటే తాము తిరగవద్దని కొట్టినట్లు మాపై తప్పుడు ఆరోపణలు చేసి ఈ వ్యవహారంతో ఏ సంబంధం లేని సీఎం సురేశ్ నాయుడుపై, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డితో పాటు మాపై అక్రమ కేసు బనాయించటం దారుణమన్నారు. దీనిపై మేము న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. సురేశ్‌నాయుడు మా ట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మమ్మల్ని చూసి వై సీపీ ఎక్కడ ఖాళీ అవుతుందోనని భయపడుతున్నారన్నారు. మాకు ఎలాంటి సంబంధం లేకున్నా తప్పుడు కేసులో ఇరికించి ఎన్నికలలో ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నాడన్నారు. మాపై తప్పుడు కేసులు నమోదు చేసిన పోలీసులపై ప్రైవేట్ కేసు వేస్తామని తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 27 : వైవీయూ పరిధిలో డిసెంబరులో జరిగిన డిగ్రీ 3, 4 సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఈశ్వరయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ డిగ్రీకి సంబంధించి బీఏ, బీకాం బీఎస్సీ, బీబీఏ, బీవోసీ మూడో సెమిస్టరులో 64.38 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఈ పరీక్షలకు 5062 మంది విద్యార్థులు హాజరు కాగా 3259 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో 8803 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, వీరికి 4989 మంది (56 .64 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ మమత, డాక్టర్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 27: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాతో పాటు రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక కారు చౌకగా అమ్ముకుంటూ నష్టపో తున్నా రన్నారు. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తే గిటు బాటు ధరలు వచ్చినప్పుడు పంటను విక్రయిం చడం ద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు వెంకటేశ్, సీపీఐ పట్టణ నాయకులు రాఘవేంద్రనాయక్, కిశోర్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి రూ.25వేలు ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం చేస్తున్న ముక్కా సాయి వికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27: మండలంలోని ముదినే పల్లె అరుంధతీవాడలో అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నయ్య అనే వ్యక్తికి టీడీపీ యువ నాయకుడు ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి 25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఈ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, అడపాల ప్రేమ్‌కుమార్, పసుపులేటి సుబ్రమణ్యం, సాలవ రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత యువకుడికి...

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 27: ఒంటిమిట్టలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న శివకృష్ణ అనే యువకునికి మండలంలోని ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 6వేల నగదును అందచేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శివకృష్ణ ఆరోగ్యాన్ని చూపించుకునే లేని స్థితిలో ఉండటంతో దాతలు స్పందించాలని విన్నవించడంతో మానవతా హృదయంతో ఉపాధ్యాయులు జయరామ య్య తోటి ఉపాధ్యాయులతో కలిసి నగదును అందజేశారు. కుటుంబ పోషణ కష్టంగా ఉందని.. మరింతమంది దాతలు సహకరించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

మార్చి 16న లోక్ అదాలత్

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 27: లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి కోర్టులో మార్చి 16వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జడ్జి ఎస్.ఫైజున్నీసా తెలిపారు. పెండింగ్ కేసులు, మొండి బకాయి సమస్యలు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని.. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

రాజంపేట, ఫిబ్రవరి 27 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిం చేందుకు అధికార, పోలీసు యంత్రాంగం సమిష్టిగా పనిచేయాలని రాజంపేట ఆర్డీవో మోహన్‌రావు, డీఎస్పీ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం రాజంపేటలో జరిగిన ఎన్నికల, పోలీసు అధికారులకు ఎన్నికల విధీ విధా నాలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా వారు ఎన్నికల నియమావళిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల నియమ నిబంధనలను తూచా తప్ప కుండా పాటిస్తూ ఎటువంటి అవాంఛ నీయ సంఘ టనలు జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఎన్నికల అబ్జర్వర్‌లకు సమాచారం అందించాల న్నారు. రాజంపేట డివిజన్‌లోని ఎన్నికల, పోలింగ్, మండల అధికారులు నిబంధనలపై పూర్తిస్థాయి దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐలు మద్దయ్య ఆచారి, మంజునాధరెడ్డి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడున్న డీఎస్పీ చైతన్య, పక్కన ఆర్డీవో మోహన్‌రావు, హాజరైన అధికారులు

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు చేయండి : జగనన్న కాలనీలలో పేదలకు మంజూరు చేసిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లను వెంటనే పూర్తి చేయాలని వీఆర్వోలకు ఆర్డీవో మోహన్‌రావు సూచించారు. రాజంపేట మునిసిపాలిటీలో, మండలంలో పేద ప్రజల కోసం మంజూరు చేసిన ఇంటి పట్టాలు, ఇంటి నిర్మాణాలను పరిశీలించి ఆయా పంచాయతీలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాల న్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

సంబేపల్లె, ఫిబ్రవరి 27: సార్వత్రిక ఎన్నికలకు మండల వ్యాప్తంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వసతులు కల్పించాలని ఆర్డీవో రంగస్వామి తెలిపారు. మంగళవారం పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. సంబేపల్లె, మోటకట్ల, వంగిమళ్ల వాళ్లపల్లె, దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, దేవపట్ల ప్రాథమిక, ఆదర్శ పాఠశాలలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసులతో కలిసి త్వరలో జరగబోయే ఎన్నికల ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించారు. పోలింగ్ స్టేషన్లలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రానికి అందుబాటులో ఉండి ప్రజలకు సమాచారాన్ని అందించేలా చూడాలని తెలియజేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పొదుపు అలవాటు చేయాలి



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న లీడ్ బ్యాంక్ సిబ్బంది

సంబేపల్లె, ఫిబ్రవరి 27: విద్యార్థులకు చదువుతో పాటు పొదుపు చేయడం అలవాటు చేయాలని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరా స్యత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈ ఏడాది 26 నుంచి మార్చి 1 వరకు జిల్లా వ్యాప్తంగా ఆర్థిక అక్షరా స్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు చిన్న నాటి నుండే పొదుపు చేయడం అలవాటు చేయడం వల్ల కలిగే ప్రయో జనా లను తెలియజేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని 100 మంది విద్యార్థినీ, విద్యార్థులకు టీ షర్టులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు చిత్తూరు- కడప జాతీయ రహదారిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, లీడ్‌బ్యాంక్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వన్నూరు బాషా, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్స్ కవిత, సాయిలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

గాలివీడు, ఫిబ్రవరి 27: మండలంలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని మండల విద్యాధికారులు నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో విద్యాహక్కు చట్టం అమలుకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ ప్రాధాన్యత అంశాలను బట్టి 2024-25 విద్యా సంవత్సరానికి అప్లికేషన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆర్ఫాన్స్ పిల్లలు, హెచ్ఐవీ, ఎయిడ్స్, స్ట్రీట్ చిల్డ్రన్, మొదలగు వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండల పరిధి లోని అన్ని ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు నమోదు చేయాలన్నారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

బీఎల్‌ఓల పనితీరుపై ఫిర్యాదు

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 27: నియోజకవర్గంలోని 252 పోలింగ్ కేంద్రాల్లో ఉన్న బీఎల్‌ఓల పనితీరుపై పలు అనుమానాలు ఉన్నాయని రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులేల రమేష్ ఎన్నికల అధికారి లీలారాణికి ఫిర్యాదు చేశారు. మంగళవారం కోడూరు తహశీల్దార్ కార్యా లయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జీరో డోర్ నెంబర్ల మీద ఉన్న ఓటర్లను, డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటర్లను, రికార్డులు సక్రమంగా లేని వారిని గుర్తించి తొలగించాలని కోరారు. టీడీపీ కార్యకర్తలు ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులను గుర్తించి సవరించాలని బీఎల్‌ఓలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులు సవరణ చేయాలని ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. రాజంపేట పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

నందలూరు, ఫిబ్రవరి 27: సున్నా నుండి ఐదు సంవత్సరాలలో పిల్లలకు 100 శాతం పోలియో చుక్కలు వేసి పల్స్‌పోలియో కార్యక్రమం విజయ వతం చేయా లని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ పేర్కొన్నారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌కుమార్ మాట్లాడుతూ పోలియో చుక్కలు వేసే విధానం గురించి వివరించారు. ఎంపీడీవో శేఖర్ నాయక్, ఎంఈవో అనంతకృష్ణ, సూపర్‌వైజర్ సునీతమ్మ, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, పీహెచ్ఎన్ శైలజ, సీహెచ్‌వో వెంకట నారాయణ, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

1న పశువుల సంత బస్టాండు గేటు వేలం పాట

రామాపురం, ఫిబ్రవరి 27: రామాపురంలో పశువుల సంత, బస్టాండు గేటుకు 2024-25 సంవత్సరానికి వసూలు హక్కు కల్పించేందుకు మార్చి 1న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు నల్లగుట్టపల్లె పంచాయతీ సెక్రటరీ విమలకుమారి తెలి పారు. వేలంపాట పాల్గొనే వారు ముందుగా పశువుల సంతకు రూ.50వేలు, బస్టాండు గేటుకు రూ.30వేలు దరావత్తులు చెల్లించి పాల్గొనాలని తెలిపారు. పాటదారుడు స్టాంప్ డ్యూటీ చట్టం మేరకు ఐదు శాతం స్టాంపు డ్యూటీ చెల్లించి అగ్రిమెంట్ చేయించుకోవాలని ఆమె తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తనిఖీ

సిద్దవటం, ఫిబ్రవరి 27: సిద్దవటం ప్రభుత్వ కమ్యునిటీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలతో స్టేట్ టీం సభ్యులు డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్ సెంటర్‌ను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో రాత్రి వేళలో వైద్యం అందిస్తున్నారని రోగులు అధికారులకు తెలపడంతో సంతృప్తి చెందారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చలో తాడేపల్లెగూడెంకు తరలివెళ్లిన జనసేన నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 27: తాడేపల్లెగూడెంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జరిగే ఉమ్మడి బహిరంగ సభకు మంగళవారం జనసేన పార్టీ నాయకులు తరలివెళ్లారు. జనసేన నియోజకవర్గ నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహ నాల్లో నియోజకవర్గం నుంచి తాడే పల్లె గూడెంకు వెళ్లారు. శ్రీనివాసరాజు జెండా ఊపి వాహనాలను తరలించారు. జనసేన నియోజకవర్గ నాయకులు సింగంశెట్టి నరేంద్ర, మాజీ జెడ్పీటీసీ యల్లటూరి శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ బహిరంగ సభను విజయవంతం చేయండి

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



బీసీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగన్‌మోహన్‌రాజు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 27: రాజంపేట పార్లమెంట్‌కు సంబంధించి జయహో బీసీ బహిరంగ సభను రాయచోటి పట్టణంలోని రాజు స్కూల్ వద్ద బుధవారం నిర్వహించనున్నారు. సభావేదికకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జయహో బీసీ సభను నిర్వహించేందుకు తమ పార్టీ కార్యవర్గం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు. పార్లమెంట్ పరిధి లోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు. అధినేత ఆదేశాల మేరకు బీసీలలో మరింత చైతన్యం తీసు కొచ్చి వారిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఈసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ సీని యర్ నాయకుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకొని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం జరుగు తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ సామాజిక వర్గానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. వైసీపీ దురాగతాలను బీసీలు అందరూ వ్యతిరేకిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏర్పాట్ల పరిశీ లనలో ఆయనతో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రేవతి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 27: రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం అని టీడీపీ నాయకురాలు నగిరిపాటి రేవతి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని చిట్వేలి మండలంలోని మల్లెంపల్లె హరిజనవాడ, నేతివారిపల్లి పంచాయతీలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, మౌలిక వసతులు పుష్కలంగా ఉండేవని.. ఇప్పటి పరిస్థితులు చూస్తుంటే అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. పంచాయతీల నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో బుడుగుంటపల్లి సీనియర్ నాయకులు సిద్ధేశ్వర, కొమ్మ శివ, దళిత నాయకులు తేనేపల్లి చిన్న, విశ్రాంతి తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలు



కొత్తపేటలో ప్రచారం నిర్వహిస్తున్న అనితా దీప్తి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 27: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోను నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని మహిళా నాయకురాలు దుద్యాల అనితా దీప్తి తెలిపారు. మంగళవారం మండలంలోని మారివారి పల్లె, అబ్బినాయుడుపల్లె, యానాదిపల్లె, శెట్టిగుంట గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోలో మహిళలకు, యువతకు పెద్దపీట వేశారని తెలిపారు. టీడీపీ అధికారంలో రాగానే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, వెంకటయ్య, మణి, మందా నాగేశ్వరరావు, మామిళ్ళ రామయ్య, మిట్టవీది మధు, నగరిపాటి సంతోష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం కోసం శాశ్వత భవనం ఏర్పాటు

● రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 27: కోదండ రామాలయంలో నిత్య అన్నదానం కోసం మేడా ట్రస్ట్ ద్వారా శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొ న్నారు. రాజ్యసభ సభ్యుడైన తరువాత మొదటిసారిగా మంగళవారం ఉదయం రామాలయానికి చేరుకున్నారు. టీటీడీ అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కోదండరాముని దర్శించుకుని పూజలు చేశారు. రాజ్యసభసభ్యుడు కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని.. నిరంతరం ప్రజాసేవ కోసం పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఏ.పురు షోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మేము టీడీపీలోనే ఉన్నాం... దుద్యాల సర్పంచ్

సంబేపల్లె, ఫిబ్రవరి 27: దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి తెలుగుదేశం మద్దతుతో గెలిచిన అభ్యర్థి అని వైసీపీ వ్యక్తి కాదని టీడీపీ నాయకుడు కోటేశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం దుద్యాల సర్పంచ్ వైసీపీ నుంచి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరినట్లు చెప్పడం వాస్తవం కాదన్నారు. 2017 నుంచి తాము టీడీపీలో ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో దుద్యాల పంచాయతీ వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేసే పార్టీలకే మద్దతు



ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 27: వచ్చే ఎన్నికల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసే పార్టీలకే తాము మద్దతిస్తామని యూటీఎఫ్ నాయకులు ప్రకటించారు. మంగళవారం రాజంపేటలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చంగల్‌రాజు, జిల్లా కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, రమణమూర్తిలు మాట్లాడుతూ ఓటర్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌లో సీపీఎస్, జీపీఎస్ వల్ల కలిగే నష్టాలను బేరీజు వేసి ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలను, ప్రజలను చైతన్య వంతులను చేసేందుకే ఇవి దోహదం చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు ప్రధాన అజెండాగా మారనున్నట్లు తెలిపారు. అందువల్ల ప్రధాన పార్టీలు తాము ఆకాంక్షలను పరిగణలోకి తీసుకోకతప్పదన్నారు. ఉద్యోగుల పట్ల చులకనగా చూస్తే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. యూటీఎఫ్ నాయకులు రమణయ్య, నాగయ్య, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

నందలూరు, ఫిబ్రవరి 27: ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యంగా కలగకుండా అన్ని వసతులను ఏర్పాట్లు చేయాలని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి సి.మోహన్ రావు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అరవపల్లె గ్రంథాలయంలోని పోలింగ్ కేంద్రాన్ని, జిల్లా పరిషత్ క్రీడా మైదానం ఆవరణలోని ప్రాథమిక పాఠశాలలోని 94, 95 నెంబ ర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 27: కడప పట్టణం బెల్లంమండి వీధికి చెందిన వైద్య విద్యార్థిని దేవత మౌనికకు రైల్వేకోడూరు వాసవీ క్లబ్, వనితా క్లబ్ సభ్యులు రూ.66వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవత మౌనిక కేరళ రాష్ట్రంలోని క్యాలికట్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌లో పీజీ మూడో సంవత్సరం చదువుతుందని.. ఆమెకు ఇప్పటి వరకు పట్టణానికి చెందిన కామిశెట్టి చక్రవర్తి ఆర్థిక సాయం అందించారన్నారు. ఈ ఏడాది వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించామని పేర్కొన్నారు. మంగళవారం దేవత మౌనిక అన్న దేవత రామన్‌కు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ పెంద్యాల విజయ్‌కుమార్, రీజనల్ సెక్రెటరీ పొన్నూరు నిరంజన్ బాబు, జోన్ చైర్మన్ సుమన్, అధ్యక్షుడు కుమార్, వనితా క్లబ్ అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.

ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

వీరబల్లి, ఫిబ్రవరి 27: మండలంలోని వడ్డిపల్లె వద్ద ఉన్న ఎస్వీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 29వ తేదీ గురువారం వీఆర్‌డీఎస్ సహ కారంతో కడపలోని మాతృశ్రీ ఐవీఎఫ్ క్లీనిక్ ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వీఆర్‌డీఎస్ అధ్యక్షుడు దుగ్గనపల్లె సురేంద్రారెడ్డి తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వై.ప్రమోద శిబిరానికి విచ్చేసిన వారికి ఉచితంగా పరీక్షిస్తారన్నారు. ఉచిత కౌన్సిలింగ్‌తో పాటు సంతానలేమికి గల కారణాలు తెలియజేసి చికిత్స విధానాలపై వివరి స్తారని చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చే దంప తులు తమ పాత రిపోర్టులను తీసుకురావాలని సూచిం చారు. పేర్ల నమోదుకు సెల్ నెంబర్లు 7995629110, 9490024324లను సంప్రదించాలని ఆయన కోరారు.

న్యాయం చేయకపోతే ఆందోళనలకు సిద్ధం

● మంగంపేట కాపుపల్లె వాసుల నిరసన



ఆందోళన వ్యక్తం చేస్తున్న కాపుపల్లి గ్రామస్తులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27: డేంజర్‌జోన్ గ్రామాలైన మంగంపేట కాపుపల్లె, అరుంధతివాడ, హరిజనవాడ గ్రామాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని ఆయా గ్రామస్థులు తెలిపారు. మంగళవారం క్వారీ వద్ద మంగంపేట కాపుపల్లె గ్రామానికి చెందిన బెరైటీస్ ఆధారిత ప్రజా సంక్షేమ సంఘం నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, దేవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట పునరావాస గ్రామానికి సంబంధించిన సమస్యలు పరిష్కరించకుండానే ఇబ్బందులు సృష్టిస్తున్నారని తెలిపారు. ఆర్‌ఆర్-5 నిర్వాసితులకు సంబంధించి ఇళ్లకు పరిహారం, ప్యాకేజీ డబ్బులను పూర్తిగా చెల్లించలేదని తెలిపారు. అలాగే నిర్వాసితులకు కేటాయించిన లేఅవుట్‌లలో ఇళ్ల పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎస్ఎంఆర్ కమిటీ నివేదికల ప్రకారం నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. సత్యమ్మ, హనుమాన్ దేవాలయ కమిటీకి సంబంధించి పరిహారం పూర్తిగా చెల్లించలేదన్నారు. పునరావాసం కల్పించకుండానే సర్వే నెంబరు-8లో ఉన్న 72.77 ఎకరాల స్థలాన్ని పశువుల మేత బీడు, కాటమ దేవునిగుడిగా ఉపయోగించుకునే స్థలంతో పాటు శ్మశానాన్ని కూడా ఏపీఎండీసీ వేస్ట్‌మట్టితో డంపింగ్ చేస్తున్నారని తెలిపారు. సర్వే నెంబరు 8కి సంబంధించిన భూమిని కాపాడుకునేందుకు హైకోర్టులో కేసులు వేశారని, దానికి పూర్తిస్థాయి న్యాయం చేయాలన్నారు. అలాగే నిర్వాసితులకు సంబంధించిన భూములకు పూర్తి పరిహారం చెల్లించలేదని, శతాబ్దాల కాలం నాటి గుడివారమ్మ గుడిని కూడా పరీక్షించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. కాపుపల్లె గ్రామానికి న్యాయం చేయకపోతే గ్రామస్తుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పులపత్తూరు రామసుబ్బారెడ్డి, దేవేంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుప్పంలో ఒంటరి ఏనుగు హల్‌చల్

భయాందోళనతో పరుగుతీస్తూ కిందపడి రైతుకు తీవ్ర గాయాలు

కుప్పం రూరల్, ఫిబ్రవరి 27: కుప్పం మండలం పైపాళ్యం గ్రామం వద్ద పొలాలలో మంగళవారం తెల్లవారు జామున ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. కంగుంది వైపునుంచి వచ్చిన ఈ ఏనుగు అటుఇటూ పరుగులు తీసింది. ఆ సమయంలో పొలా లు, తోటల్లో ఉన్న రైతులు భయాందోళనకు గురయ్యారు. రోజా పూల తోటలో ఉన్న రైతు మునిరత్నం ఏనుగు నుంచి తనని తాను రక్షించుకోవడానికి పరుగులు తీశారు. ఈ క్రమంలో కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. తొలుత కుప్పం ప్రభుత్వాస్పత్రిలో అనంతరం పీఈఎస్‌లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న మునిరత్నంను సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ పరామర్శించారు. వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మొదలియార్ సాధికార సమితి అధ్యక్షుడు మునిరత్నం రైతును పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.


చికిత్స పొంతున్న రైతు మునిరత్నం

పేలుడు పదార్థం తిని ఆవుకు గాయాలు

రామకుప్పం, ఫిబ్రవరి 27: రామకుప్పం మండలం 89పెద్దూరు అటవీప్రాంతంలో వన్యప్రాణుల వేటగాళ్ళు పేట్రేగిపోతున్నారు. తరచూ వీరి ఉచ్చుకు మూగజీవాలు బలైపోవడం, తీవ్రగాయాలకు గురవడం పరిపాటిగా మారింది. 89పెద్దూరు సమీపంలోని ఉప్పువంక అటవీప్రాంతంతో మంగళవారం సాయంత్రం వన్యప్రాణుల వేటకు వేటగాళ్లు అమర్చిన పేలుడు పదార్థ ఉండను తినేందుకు ఓ ఆవు ప్రయత్నించింది. ఈ క్రమంలో సంభవించిన పేలుడుతో తీవ్రంగా గాయపడింది. సాయంత్రమైనా ఆవు ఇంటికి రాకపోవడంతో రైతు రవి అటవీ ప్రాంతంతో వెదకుతూ వెళ్లారు. నోటికి తీవ్రగాయమైన ఆవును గుర్తించి, ఇంటికి తీసుకొచ్చారు. నెల రోజుల కిందట ఇతడికి చెందిన ఓ ఆవు కూడా పేలుడు పదార్థ ఉండను తిని మృత్యువాత పడింది. అంతకు ముందు నాలుగునెలల కిందట ఇదే అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల ఉచ్చుకు ఓ పులి ప్రాణాలు కోల్పోయింది. ఇప్పటికైనా అధికారులు నిఘా ఏర్పాటు చేసి, వేటగాళ్ల దుశ్చర్యలను నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు.



చెర్లోపల్లె వద్ద గుర్తు తెలియని వ్యక్తి హత్య



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 27: గంగాధర నెల్లూరు మండలం చెర్లోపల్లె వద్ద గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యారు. సీఐ శంకర్ తెలిపిన మేరకు.. చిత్తూరు- తిరుత్తణి ప్రధానరహదారి పెద్దకాల్వ పంచాయతీ చెర్లోపల్లె దళితవాడకు సమీపంలోని తోపులో సోమవారం రాత్రి కొందరు మద్యం తాగారు. తర్వాత ఒక వ్యక్తి తలమీద ఎవరో బండరాయితో దారుణంగా కొట్టి హత్యకు పాల్పడినట్లుగా విచారణలో ప్రాథమికంగా గుర్తించారు. హత్యకు గురైనవ్యక్తి మద్యం తాగిన వారికి సంబంధించిన వాడా.. లేదా మరెవరైనానా? ఏ కారణం చేత హత్య చేశారనేది తేలాల్సి ఉంది. హత్యాస్థలాన్ని, మృతదేహాన్ని చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. క్లూస్‌టీమ్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించడంతో పాటు కొన్ని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, సిమెంట్ రంగుప్యాంట్, షర్ట్, రజనీకాంత్ బొమ్మకలిగిన తెల్ల టీషర్ట్ ధరించి ఉన్నాడన్నారు. ఇతడి వివరాలు తెలిసిన వారు చిత్తూరు డీఎస్పీ 94407 96704, సీఐ 94407 96716 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐలు రామాంజనేయులు, వెంకటసుబ్బమ్మ కూడా హత్యాస్థలాన్ని పరిశీలించారు.

కార్పొరేటర్‌పై దుండగుల దాడి


చికిత్స పొందుతున్న శశికుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 27: చిత్తూరు నగరంలోని 42వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ శశికుమార్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో ఆయన చెవి భాగంలో తీవ్ర గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తన సొంత పనుల నిమిత్తం కార్పొరేటర్ శశికుమార్ మంగళవారం కొంగారెడ్డిపల్లెకు వెళ్లి ఇంటికి తిరుగుపయనం అయ్యారు. ఆర్టీసీ బస్టాండు మీదుగా రైల్వే స్టేషన్ సమీపంలో వస్తున్న సమయంలో పక్కనే ఉన్న రైల్వే ట్రాక్‌పై నుంచి కొంత మంది చప్పట్లు కొట్టి పిలిచారు. దీంతో ఆయన ద్విచక్ర వాహనాన్ని ఆపి వారి వద్దకు వెళ్లారు. రాత్రి సమయం కావడంతో ఆ ప్రాంతం చీకటిగా ఉంది. శశికుమార్ వారి దగ్గరకు వెళ్లగానే అక్కడున్న వారు బీరు బాటిళ్లతో అతడి తలపై కొట్టే సమయంలో తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో చెవి భాగంపై తగలడంతో గట్టిగా అరవగా.. సమీపంలోని ఆటో డ్రైవర్లు వెళ్లారు. తన తమ్ముడికి ఫోన్ చేయమని నంబరు చెప్పి శశికుమార్ పడిపోయారు. ఆటో డ్రైవర్ల సమాచారంతో కుటుంబీకులు అక్కడికి చేరుకుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న శశికుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. అతడు కోలుకున్నాక దాడి గురించి పూర్తి వివరాలు తెలియవచ్చని పోలీసులు అంటున్నారు.

కుప్పం మున్సిపల్ కమిషనరుగా నాగేశ్వరరావు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 27: చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపల్ కమిషనరుగా నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బి.నాగేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఇప్పటి వరకు తిరుపతి మున్సిపల్ అదనపు కమిషనర్ కుప్పం ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వహిస్తుండగా ఆ స్థానంలోకి నాగేశ్వరరావును బదిలీ చేసింది.

నవకంఠ రావణుడు!



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కానుకగా భక్తులు సమర్పించిన రావణాసుర వాహనమిది.శివరాత్రి ఉత్సవాల ఊరేగింపులో వాడుకునేందుకు ఇద్దరు భక్తులు దారువుతో తయారు చేసిన ఈ వాహనాన్ని సోమవారం ముక్కంటి ఆలయానికి అందజేశారు. అయితే పది తలలుండాల్సిన రావణాసురుడికి 9మాత్రమే వుండడాన్ని అధికార యంత్రాంగం కానీ , ధర్మకర్తల మండలి కానీ గుర్తించకనే ఆలయంలో పెట్టేశారు. ప్రచార ఆర్భాటం, కమీషన్ల కక్కుర్తిపై దృష్టి పెట్టడం తప్ప ఇలాంటి వాటి గురించి ఎందుకు ఆలోచిస్తారంటూ భక్తజనం నుంచీ పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: స్విమ్స్ శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో నగదు రహిత వైద్య సేవలను మార్చి ఒకటో తేదీనుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజీ, ఒబెస్ట్రిక్ (స్త్రీల వ్యాధులు, ప్రసూతి విభాగం), పీడియాట్రిక్స్ ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాల పరిధిలో ఆరోగ్యశ్రీ కింద నగదు రహిత వైద్య సేవలు అందిస్తామన్నారు. సాధారణ, సిజేరియన్ కాన్పులు, టాన్సిల్స్, కాటరాక్ట్, హెర్నియా, అపెండిక్స్, మొలలు, థైరాయిడ్‌తోపాటు సాధారణ జబ్బులైన జ్వరాలు, వాంతులు, విరేచనాలు మొదలైన వాటికి కూడా నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అతివేగానికి ఇద్దరు యువకుల బలి


మృతులు హరీష్, రామ్‌చరణ్

రేణిగుంట,ఫిబ్రవరి 27:అతివేగంతో బైకులను నడిపి ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. తిరుపతి జిల్లా గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.... చెన్నై-రేణిగుంట జా తీయరహదారిలో రేణిగుంట మండలం మొలగమూడి బస్టాప్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. నారాయణవనానికి చెందిన హరీష్(22), ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన రామ్‌చరణ్(17) పుత్తూరు వైపు నుంచి పల్సర్ బైక్‌పై వస్తుండగా మొలగమూడి బస్టాప్ సమీపంలో రివర్స్ చేస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.మృతదేహాలను పోస్టుమార్టం కోసం తిరుపతి లోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 70,077 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,427 మంది తలనీలాలు సమర్పించారు.

కుప్పంపై సీఎం కపట ప్రేమ : గౌనివారి


సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, ఫిబ్రవరి 27: కుప్పం నియోజకవర్గంపై సీఎం జగన్ చూపుతున్న కపట ప్రేమను ప్రజలు నమ్మే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గుండిశెట్టిపల్లె సభలో సీఎం జగన్ అన్నీ అబద్ధాలే చెప్పారన్నారు. శ్రీశైలంనుంచి (650 కిలోమీటర్లు) కొండలు, గుట్టల మీదుగా కుప్పానికి హంద్రీ-నీవా జలాలను తాను తీసుకొచ్చానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2015లో టీడీపీ ప్రభుత్వం హంద్రీ-నీవా పనులు ప్రారంభించి 2019నాటికి 80శాతం పూర్తి చేసి, వి.కోట మండలం కృష్ణాపురం వరకు కృష్ణాజలాలను తీసుకొచ్చిందన్నారు. కుప్పం ప్రాంతంలో అప్పటి వైసీపీ ఇన్‌చార్జి చంద్రమౌళి పలుచోట్ల రైతులను రెచ్చగొట్టి కోర్టులకు వెళ్లేలా చేయడంతో అక్కడక్కడా పనుల అసంపూర్తికి కారకులయ్యారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు స్తబ్ధుగా ఉండి, ఇప్పుడు హడావిడిగా 20శాతం పనులు పూర్తి చేసిన వైసీపీ పాలకులు గొప్పలు చెప్పుకుంటూ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని తాను పులివెందులతో సమానంగా అభివృద్ధి చేశానని చెప్పిన సీఎం జగన్.. తన పాలనలో కుప్పానికి ఎన్ని నిధులిచ్చారో, పులివెందులకు ఎంత ఖర్చు పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా. అబద్ధాలను ప్రచారం చేసినా ప్రజలు నమ్మరన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘనవిజయం సాధించి చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీఎంపీపీ ఆంజినేయరెడ్డి,నేతలు రామ్మూర్తి, మహ్మద్‌రఫీ, మనోహర్, వెంకటరమణ, సుబ్బి, సురేష్, భానుమూర్తి, భాస్కర్, జ్ఞానశేఖర్‌రెడ్డి, పద్మమ్మ, అలివేలు మంగమ్మ, రామలింగారెడ్డి, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో 1న కాంగ్రెస్ బహిరంగ సభ

● ప్రత్యేక హోదా అజెండాగా నిర్వహిస్తున్నామన్న గిడుగు


విలేకర్ల సమావేశంలో గిడుగు రుద్రరాజు

చిత్తూరు రూరల్/పలమనేరు, ఫిబ్రవరి 27: ప్రత్యేక హోదా అజెండాతో తిరుపతిలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో, పలమనేరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి సభలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను బాగుచేయాలంటే తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలన్నీ బీజేపీకి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తాము ప్రజల మేలు చేసే పథకాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ సచిన్‌పైలట్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఇతర నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సభకు నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చిత్తూరు సమావేశంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శంకర్, ఏఐసీసీ మెంబర్ పార్థసారథిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు విక్టోరియా, రాణి, నేతలు చిట్టిబాబు, శంకర్ టిక్కీ రాయల్, వెంకటేష్, నరసింహులు, పరదేశి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. పలమనేరు పార్టీ కార్యాలయంలో నాయకులు శ్రీరామమూర్తి, పార్థసారథిరెడ్డి, రవీంద్రరెడ్డి, ప్రభాకర్, ధనంజయగౌడు, భాస్కర్, దొరస్వామి, మణి తదితరులు గిడుగు రుద్రరాజును కలిశారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలను పాటించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. నోడల్ అధికారులందరూ గురువారం నుంచి తమకు కేటాయించిన ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నం కావాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బందిని మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ గుర్తించిందని, అధికారుల వివరాలను అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. ఈవీఎంలను సరైన రీతిలో భద్రపరచాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవోలు, ఈఆర్వోలు, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి

జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. మ్యుటేషన్ ప్రక్రియలో దొర్లిన తప్పులను సరిదిద్దాలని, ఆర్డీవో స్థాయిలో అనుమతి జరిగిందన్నారు. 1500 ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైతే ఆక్సిలరి పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. రీ సర్వే మూడో దశను త్వరలో పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో సర్వే ఏడీ మహబూబ్ భాషా, ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, డీటీలు, గ్రామ సర్వేయర్లు, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధ్యాపక పదోన్నతులకు పచ్చజెండా

ఎస్వీయూ పాలకమండలిలో పలు అంశాలపై సుదీర్ఘ చర్చ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూనివర్సిటీలోని అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తూ పాలకమండలి పచ్చజెండా ఊపింది. యూనివర్సిటీలోని 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించేందుకు ఇటీవల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ క్రమంలో దీనిపై చర్చించి అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగానూ, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లగానూ పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆమోదిస్తూ తీర్మానం చేశారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం వీసీ చాంబర్‌లో పాలకమండలి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఆర్థిక శాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ సమావేశం సాగింది. వర్సిటీకి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పాలకమండలి సభ్యులు జ్యోతి, నారాయణబాబు, సంధ్యారాణి, మొహిద్దీన్ బాష, మంజుల, సుగుణమ్మ, సుమకిరణ్, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తీర్మానాలివే..

● 53 మంది అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతులు ● నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ జారీ చేసిన జీవో-10 అమలు ● పలు భవన నిర్మాణ పనులు, వాటికి సంబంధించిన నిధుల అంచనాకు ఆమోదం ● నూతన కోర్సుల ఏర్పాటుకు అనుమతి ● వివిధ విభాగాల్లో దాతల సహకారంతో గోల్డ్ మెడల్స్‌కు ఆమోదం ● ఆర్థికపరమైన అంశాలపై చర్చించి, నిర్ణయం తీసుకునేందుకు ఐదుగురితో ఆర్థిక సలహా మండలి ఏర్పాటు.

స్కాలర్‌షిప్ ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తాం

మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్సీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, సర్టిఫికెట్లు ఇవ్వకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని పద్మావతి మహిళా వర్సిటీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ అరుణ్ హల్దార్ హెచ్చరించారు.2018 నుంచి యూనివర్సిటీలో నిర్వహించిన బీఏ, ఎంఏ పబ్లిక్ పాలసీ అండ్ ఆంత్రోపాలజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉంచారు. దాంతో చండీప్రియ (చంద్రలేఖ) నేతృత్వంలోని 31మంది ఎస్సీ విద్యార్థినులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషన్.. వర్సిటీ రిజిస్ట్రార్, ఇతర అధికారులకు సమన్లు జారీ చేసింది. కమిషన్ ఎదుట విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఇటీవల కమిషన్ చేపట్టిన విచారణకు రిజిస్ట్రార్ హాజరై వివరణ ఇచ్చారు. దాంతో 21 రోజుల్లోపు విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్, సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరింది. లేకుంటే అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించేందుకు వర్సిటీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, సోషియల్ వెల్ఫేర్ అధికారులకు లేఖ రాశారు.

ఏడాదిన్నరగా నడుస్తున్న వ్యవహారం

ఏడాదిన్నరగా ఈ వ్యవహారం నడుస్తోంది. గతంలో విద్యార్థినులు వర్సిటీలోనే ప్రత్యక్ష ఆందోళన కూడా చేపట్టారు. రూ. కోటీ 50 లక్షల మేర విద్యార్థినులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయి.

షార్‌లో పిఫ్ భవనం ప్రారంభం


షార్‌లో నిర్మించిన పిఫ్ భవనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 27 : తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌లో నిర్మించిన పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటి (పిఫ్) భవనాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. పీఎస్ఎల్వీ రాకెట్లతో పాటు చిన్న తరహా రాకెట్ల తయారీ, అనుసంధానం కోసం ఈ భవనాన్ని నిర్మించారు. పీఎస్ఎల్వీ ప్రయోగాలకే కాకుండా ఎస్ఎస్ఎల్వీ వంటి చిన్న ప్రయోగాల వేగవంతానికి కూడా ఇదెంతో దోహదపడుతోంది. ఇది అందుబాటులోకి రావడంతో ఇకపై ఏడాదికి 15 ప్రయోగాలు చేపట్టాలని ఇస్రో లక్ష్యం పెట్టుకుంది.ప్రధాని మోదీ తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో సుమారు రూ.1800 కోట్లతో నిర్మించిన మూడు ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో షార్‌లోని పిఫ్, మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్ టెస్ట్ ఫెసిలిటి, వీఎస్ఎస్‌సీలో ట్రైసోనిక్ విండ్ టన్నెల్ ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు.

తప్పుల చక్రవర్తి సీఎం జగన్

● శ్రీవారి ఆభరణాలు అపహరించిన రమణ దీక్షితులు
● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆరోపణ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 27: సీఎం జగన్ తప్పుల చక్రవర్తి అని, నోరు తెరిస్తే అబద్ధాలే చెబుతారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆరోపించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణా జలాలను కుప్పానికి తీసుకురావడానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.470 కోట్లు ఖర్చుపెట్టి 87 శాతం పనులు పూర్తిచేసిందని గుర్తుచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లల్లో కేవలం రూ.30 కోట్లు ఖర్చుపెట్టిందన్నారు. హంద్రీ- నీవా పనులు ఏ ప్రభుత్వ హయాంలో జరిగాయో ప్రజలకు తెలిసినా సీఎం జగన్ అబద్దాలు చెప్పి, వారిని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టీటీడీ గౌరవ ప్రధానార్చకుడిగా పనిచేసిన రమణ దీక్షితులు శ్రీవారి అభరణాలను అపహరించారని దొరబాబు ఆరోపించారు.

12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స సక్సెస్

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 27: శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో 12వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి ప్రారంభమైన ఈ శస్త్రచికిత్స మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు జరిగిందన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజోలుకు చెందిన ధర్మారావు(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురికావడంతో ఆయన గుండెను శ్రీకాకుళం నుంచి వైజాగ్ అక్కడ నుంచి తిరుపతి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు సోమవారం రాత్రి 10.25 నిమిషాలకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ గుండెను డైలేటెట్ కార్డియోమయోపతి వ్యాధితో బాధపడుతూ శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 42 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా అమర్చినట్లు డైరెక్టర్ వివరించారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వ్యక్తి పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను, సిబ్బందిని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అభినందించారు.

పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27: ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. మార్చి ఒకటి నుంచి ఏడో తేదీదాకా పరీక్షలు నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. అయితే, ఇదే తేదీల్లో టెట్‌ను ప్రభుత్వం నిర్వహించనుంది. దాంతో పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు మార్చి ఏడో తేదీకి వాయిదా పడ్డాయి. 14వ తేదీ దాకా ఈ పరీక్షలు కొనసాగుతాయని సీఈ దామ్లానాయక్ పేర్కొన్నారు.

రైతులను నట్టేట ముంచిన జగన్!

● నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 27: రాష్ట్రంలోని రైతాంగాన్ని ముఖ్యమంత్రి జగన్ నట్టేట ముంచాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీలో మంగళవారం ఆయన జనసేన, టీడీపీ శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, సాగు పెట్టుబడి గణనీయ తగ్గింపు, పంటలకు పూర్తిగా పెట్టుబడి సాయం, కనీస గిట్టుబాటు ధర వంటి అనేక హామీలు గుప్పించిన జగన్, ముఖ్యమంత్రి అయ్యాక రైతాంగాన్ని పట్టించుకోవడం మానేశారన్నారు. ఏడాదికి రూ.13,500 లను పెట్టుబడి సాయంగా అందిస్తానని హామీ ఇచ్చి దానిని రూ.7,500లకు కుదించాడన్నారు. విద్యుత్ రంగంలో అనాలోచిత నిర్ణయాల కారణంగా రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడం లేదన్నారు. వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల జగన్ పరిపాలనలో రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రం దేశంలోనే 3వ స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో, పంటల కోసం రైతులు చేస్తున్న అప్పుల్లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. అన్నపూర్ణగా పేరుగడించిన రాష్ట్రంలో అన్నదాతలు బలవన్మరణానికి పాల్పడడం బాధాకరమన్నారు. సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేసేసిన జగన్ సర్కారు రాష్ట్ర రైతాంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టేసిందని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఏటా ప్రతి రైతుకూ రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని, గతంలోనూ రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత తమదేనని, ఆ స్ఫూర్తిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బోడుమల్లువారిపల్లె పంచాయతీలోని మేలకవానికాల్వ, బోడుమల్లువారిపల్లె, మొరవ వడ్డిపల్లె, వడ్డిపల్లె కాలనీ, గాండ్లపల్లె, ఎల్లంపల్లె గ్రామాల్లో ఆయన టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బోడుమల్లువారిపల్లె గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సూరా సుధాకర్ రెడ్డి, నాయకులు అమరనాథరెడ్డి, షామియాన జయన్న, మాజీ సర్పంచ్ సూరి, బాబు, ఉదయ్, శీను, ఆజాం, ఫారుఖ్, ఈశ్వర, వెంకటేశ్, పూజారి వెంకటేశ్, మోహన, చిరంజీవి, వెంకటరమణ, అబ్బు, రమేశ్ బాబు, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.



బద్దే భానుప్రకాశ్‌కు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

టీడీపీలోకి డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

దళిత, బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్(డీబీఎస్ఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దే భానుప్రకాశ్ మంగళవారం తెలుగు దేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిశోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దళిత, బహుజనుల విద్యార్థుల సమస్యల కోసం దశాబ్ద కాలంగా పోరాటాలు చేసిన భానుప్రకాశ్ టీడీపీలోకి రావడం సంతోషకరమన్నారు. అనంతరం ఆయన భానుప్రకాశ్‌కు కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. బోడుమల్లువారిపల్లె, ఎర్రగుంట్లపల్లె పంచాయతీలకు చెందిన పలువురు వైసీపీ నేతలు కార్యకర్తలు టీడీపీలో చేరారు.

చంద్రబాబు-పవన్ కలయికతో జగన్‌కు వణుకు..

వాల్మీకిపురం: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల కలయికతోనే వైసీపీ సీఎం జగన్‌లో వణుకు మొదలైందని వాల్మీకిపురం టీడీపీ మండల అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం పట్టణంలోని తోటవీధి, మూల కృష్ణమబావి, హసన్‌ఖాన్ వీధి, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపే టీడీపీ జనసేన లక్ష్యమన్నారు. తమ నాయకుడిని ఎట్టి పరిస్థితులలో ఘనమైన మెజారిటీతో గెలిపించుకు తీరుతామన్నారు. రాష్ట్రంలో అబద్ధాల సీఎం జగన్ మోసపూరిత మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని, సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో కనుమరుగు కావడం తథ్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సీఎం జగన్ సభలను ఎంతలా వ్యతిరేకిస్తున్నారో ఆ పార్టీ నాయకులు గమనించాలరు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు వల్లిగట్ల వెంకటరమణ, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకట రమణ, టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కోసూరి రమేష్ నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, తెలుగు యువత చాను, కువైట్ సయ్యద్ బాషా, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, ఎండీ యూసుఫ్, కువైట్ బాబు, బొక్కసం బ్రదర్స్, సాదిక్, సర్దార్, సయ్యద్‌అమీర్, ఆలీ, సైదు, హనీఫ్, తోటవీధి ఫణి, బాలకృష్ణమ నాయుడు, లోకేష్, నవీన్, ప్రసాద్, అరుణ్, సంతోష్, తరుణ్, తదితర ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాల్మీకిపురం: బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు

చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే శంకర్ భేటీ

ములకలచెరువు, ఫిబ్రవరి 27: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి. శంకర్ యాదవ్ మంగళవారం సాయంత్రం భేటీ అయ్యారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు అమరావతిలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రస్తుత పార్టీ పరిస్థితి పై చర్చించారని, రెండు రోజుల్లో ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే నిర్వహించి తగిన న్యాయం చేస్తానని చంద్రబాబు చెప్పినట్లు వివరించారు. తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిగా దాసరిపల్లె జయచంద్రారెడ్డికి ఖరారు చేసినందుకు వ్యతిరేకంగా శంకర్ వర్గీయులు అమరావతిలోని చంద్రబాబు నివాసం ముందు ధర్నా చేసిన విషయం విదితమే. శంకర్ వెంట ఆయన కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు.



చంద్రబాబుతో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

నలవీర గంగమ్మకు దొమ్మలపాటి పూజలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27: మదనపల్లె నియోజకవర్గ ప్రజలను చల్లంగా దీవించు తల్లీ అంటూ మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ప్రార్థించారు. మంగళవారం సీటీఎంలోని నలవీరగంగమ్మ ఆలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభంలో మునిగిన రాష్ట్రాన్ని కాపాడాలంటే చంద్రబాబును సీఎం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దొమ్మలపాటి యశశ్విరాజ్, దేవరిటి శ్రీనివాసులు, చల్లా నరసింహులు తదితరులు పాల్గొన్నారు. సీటీఎం గంగజాతరలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్, మాజీ సర్పంచ్ సురేంద్ర, పూల మురళి, గణేష్ పాల్గొన్నారు..



పూజలు చేస్తున్న దొమ్మలపాటి రమేశ్

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో రాజకీయాలు తగవు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో వైసీపీ ప్రభుత్వం చొరబడి రాజకీయాలు చేయడం తగదని టీడీపీ యువనాయకుడు దొమ్మల పాటి యశశ్విరాజ్ ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో దొమ్మలపాటి యశశ్వి విలేకర్ల సమావేశం నిర్వహించారు. డ్రెస్సింగ్‌రూమ్‌లో జరిగిన చిన్న గొడవకు ఆంధ్ర టీమ్‌లో 17వ స్థానంలో ఉన్న వైసీపీ నేత కుమారుడికి వత్తాసుగా విహారిని కెప్టెన్‌గా వైదొలగేలా చేయడం దారుణమన్నారు. విహారిని కెప్టెన్‌గా కొనసాగించాలని టీము సభ్యులందరు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌కు వినతి పత్రం ఇచ్చారన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం గ్రామీణ క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడంలో కూడా రాజకీయాలు చేసిందని ఆరోపించారు. సమావేశంలో ముని రత్నం, శ్రీధర్‌రెడ్డి, కత్తి అరుణ్, గురుమూర్తి, పసుపులేటి శ్రీనివాసులు, సికిందర్, మహేష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27: మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు చూపించాలంటూ ఏపీ మహిళా సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు, ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ మాట్లాడుతూ కోళ్లబైలు పంచాయతీలోని నిరుపేదలు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకుని ఏడాది పైగా గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం ఇంటి స్థలాలను చూపించలేదని ఆరోపించారు. మదనపల్లె చుట్టుపక్కలే ఉన్న ప్రభుత్వభూములను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ పేదలకు మాత్రం పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఇంటి స్థలాలను ఇస్తున్నారని ఆరోపించారు. కోళ్లబైలు పంచాయతీలోని ప్రభుత్వ భూములు నిరు పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మురళి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు సూరి, మహిళాసంఘం నాయకురాలు లక్ష్మీతోపాటు నిరుపేదలు పాల్గొన్నారు.



పేదలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

వయో వృద్ధులకు రాయితీలు కల్పించాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27: సీనియర్ సిటిజన్స్‌కు ఆర్టీసీ, బస్సుల్లో, రైలుల్లో రాయితీలు ప్రకటించాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని రాష్ట్ర పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామచంద్ర రావు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఏపీ సీనియర్స్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మునిగోపాల్ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునిగోపాల్‌కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో సీనియర్ సిటిజన్స్‌కు ఆర్టీసీ, బస్సుల్లో, రైలుల్లో రాయితీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో రైల్వేలో 25 శాతం కన్సెషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల అమలుకు కృషి చేసే వారికే తమ ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగపతి, అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, ఉమాపతి, రావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ కరెస్పాండెంట్‌కు ఎక్సలెన్స్ అవార్డు

కురబలకోట, ఫిబ్రవరి 27: మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరికి ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ సెక్టార్ అవార్డును తెలంగాణా ప్రభుత్వం ప్రదానం చేసింది. విద్యారంగంలో ఆయన చేసిన సేవలు, పరిశోధనలు, నాణ్యమైన విద్యా ప్రమాణాలు, సాంకేతిక రంగంలో చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన జాతీయ తెలుగు మాసపత్రిక వేడుకలలో ఆయన తెలంగాణా శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి ఈ అవార్డును ఆయనకు అందజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, సీనియర్ పాత్రికేయుడు వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.



అవార్డును అందుకుంటున్న విజయ భాస్కర్ చౌదరి

ప్రభుత్వాసుపత్రిలో కాయకల్ప బృందం తనిఖీలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 27: తంబళ్లపల్లె మండల కేంద్రం లోని ప్రభుత్వాసుపత్రిని మంగళవారం కాయకల్ప బృందం సభ్యులు సందర్శించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రతి ఏటా అందించే కాయకల్ప అవార్డును ఇంటర్నల్ పీల్ అసెస్‌మెంట్ లో భాగంగా వైద్యుడు సురేష్, రాష్ట్ర డేటా ఎంట్రీ ఆపరేటర్(ఐడీఎస్పీ) చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి నాగరాణిలు ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో స్వచ్ఛత, సదుపాయాలు, పారిశుధ్యం, రికార్డుల నిర్వహణ, ఐసీటీసీ, ఎక్స్‌రే విభాగం, ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, కోవిడ్ వార్డు, ల్యాబ్, ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరాతీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యాధికారి వెంకట్రామయ్య, వైద్యులు, నర్సులు, సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 27: ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరాయి. హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ ప్రశ్నాపత్రాలను అధికారుల సమక్షంలో లాకర్ రూమ్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 1నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమై 15వ తేదీకి ముగుస్తాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 171మంది విద్యార్థులు, రెండవ సంవత్సరంలో 179 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల చీఫ్‌గా రాధాకృష్ణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రెడ్డెప్పరెడ్డి వ్యవరిస్తారని తెలిపారు.

రామసముద్రం: ఇంటర్ ప్రశ్నపత్రాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు రూట్ ఆఫీసర్ విజయకుమార్, చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్న పత్రాలకు సీలువేసి పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షికోత్సవం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27: స్థానిక నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లేఅవుట్‌లో ఈనెల 29న వరసిద్ధి వినాయకస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సంకష్టహర చతుర్థి వ్రతం, సహస్ర మోదకార్చన, గణపతి హోమం, కుంభాభిషేకం, సిద్ధి,బుద్ధి వినాయక స్వామి కల్యాణోత్సవం, నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు సిద్దులు తెలిపారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల, అనంతరం అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, ప్రజలు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు.

29న సీటీఎంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27: మండలం, సీటీఎం గ్రామం బ్రాహ్మణవీధిలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29న నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కుమార్‌స్వామి తెలిపారు. ఈ సందర్భంగా 28న గణపతి పూజ, స్వస్తివాచనము, రక్షాబంధన, అఖండ దీపారాధన, కలశ స్థాపన, మహా మంగళహారతి అనంతరం ప్రసాద వియోగం జరుగుతుందన్నారు. 29 ఉదయం కలశారాధన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్నట్లు వివరించారు. మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, పూజలు అనంతరం మహామంగళహారతి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మదనపల్లెకు చెందిన పీఎస్ సుధా గాయత్రి, పీఎస్ చైతన్య చార్టెర్డ్ అకౌంటెంట్, ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

25 మంది బైండోవర్



డిప్యూటీ తహసీల్దార్ తపస్విని ఎదుట హాజరైన నిందితులు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 27: వివిధ కేసులలో నిందితులుగా వున్న 25మందిని డిప్యూటి తహసీల్దార్ తపస్విని ఎదుట మంగళవారం హాజరు పరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వారిని బైండవర్ చేసినట్లు తెలిపారు.

రాధారంగా మిత్రమండలి అధ్యక్షుడికి సన్మానం



బుల్లెట్ ధర్మారావును సన్మానిస్తున్న రాధారంగా మిత్రమండలి, జనసేన నేతలు

పీలేరు, ఫిబ్రవరి 27: రాధారంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావును జనసేన చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి నేతృత్వంలో కాపు సేన సభ్యులు, జనసేన నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌కు తమ సంస్థ పూర్తిగా మద్దతిస్తోందని, పీలేరు నియోజకవర్గంలోనూ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని బలపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాధారంగా మిత్రమండలి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు అర్కాట్ కృష్ణప్రసాద్, సభ్యులు అనిల్ రాయల్, తులసీ యాదవ్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రేపు కలిచెర్లలో గంధం ఉత్సవం, కంటి వైద్య శిబిరం

పెద్దమండ్యం, ఫిబ్రవరి 27: పెద్దమండ్య మండలం కలిచెర్ల గ్రామం లోని మౌలాకా పహాడ్‌లో ఈ నెల 29న గురువారం సాయంత్రం 6.45 నిమిషాలకు కడప పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో గంధం ఫాతెహా ప్రసాద కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 8. 30 గంటలకు ఖవ్వాలి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆదే రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మౌలాకా పహాడ్ వద్ద శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి (అరవింద మధురై శాఖ)వారి సహకారంతో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కంటి సమస్యలున్న వారందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎన్నికల ప్రక్రియపై బీఎల్‌వోలకు అవగాహన అవసరం

పీలేరు, ఫిబ్రవరి 27: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలని పీలేరు మండలంలోని బీఎల్‌వోలకు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియపై మంగళవారం ఆయన పీలేరు తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అనేక దశలుంటాయని, ఒక్కో దశలో పాటించాల్సిన నియమాలను క్షుణ్ణంగా అవగతం చేసుకోవాలని, ఎక్కడా నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేయకూడదన్నారు. ఈ ఎన్నికల్లో 80 ఏళ్ల దాటిన సీనియర్ సిటిజన్లు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నందున తమ పరిధిలోని వారిని గుర్తించాలన్నారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న వివిధ క్లైములను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన ఒక్కో బీఎల్‌వో పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌వో రమా, తహసీల్దారు మహబూబ్ బాషా, ఈడీటీ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ చాణక్య, తదితరులు పాల్గొన్నారు.

కలకడ: తప్పిదాలు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలకడ తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభ దశ నుంచి ముగింపు వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లో కనీస సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాను పరిశీలించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఆర్వో రమాదేవి, ఎన్నికల డీటీ ప్రదీప్ పాల్గొన్నారు.



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

బ్రిటిషు తరహా పాలనకు రోజులు దగ్గర పడ్డాయ్

● టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 27: బ్రిటిషు దొరల తరహా పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని తంబళ్ళపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని వేపూరికోట పంచాయతీ బత్తలాపురంలో మంగళవారం ములకలచెరువు జడ్పీటీసీ మాజీ సభ్యుడు కువైట్ శంకర్ అధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అరాచక, అవినీతి పాలన విరగడయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. అంతకు మునుపు కువైట్ శంకర్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కేవీ రమణ, తంబళ్ళపల్లె, పెద్దమండ్యం మండలాల పార్టీ మాజీ కన్వీనర్లు భాస్కర్‌నాయుడు, సిద్ధవరం ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయానికి కట్టుబడి టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, నాయకులు మూగి రవిచంద్ర, చాంద్‌బాషా, వెంకటసిద్ధయ్య, గోపాల్‌రాజు, శ్రీనివాసులు, గంగాదేవిలతో పాటు ఆరు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం ములకలచెరువు, కురబలకోట మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను కలిశారు. అలాగే మదనపల్లెలోని టీడీపీ నేత సీడ్ మల్లికార్జుననాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డిని కలిశారు.



సమావేశంలో మాట్లాడుతున్న తంబళ్ళపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27: మదనపల్లె నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్డీవో హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కోళ్లబైలు-2 పంచాయతీలోని పోలింగ్ కేంద్రం నెంబరు 5లో 1570 ఓటర్లు వున్నారన్నారు. ఇక్కడ మహిళలను వేరు చేసి వీరికే ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచనలతో ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, సీపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అక్షర తప్పులు వున్నాయని, కొన్ని చోట్ల కన్నడలో పేర్లు కనిపిస్తున్నాయన్నారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ ఫారమ్-8 ద్వారా ఈ తప్పులను సరిదిద్దుతామన్నారు. 18 ఏళ్ల దాటిన వారిని ఓటర్లుగా నమోదు చేయిస్తున్నామని, తప్పొప్పులు సరిదిద్దుతున్నామన్నారు. కేవలం డెలిషన్ చర్యలు 0.1శాతం దాటితే మాత్రం ఎన్నికల కమిషన్ లాగిన్‌లో చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సూపర్‌వైజర్లతో బీఎల్‌వోల ద్వారా తనిఖీ చేయిస్తున్నామన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించి నూతన ఓటర్లను నమోదు చేయిస్తున్నామన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో మదనపల్లె తహసీల్దార్ రమాదేవి, డీఎస్‌వో శేషయ్య, ఎన్నికల డీటీ అస్లాం, గొంగడి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ నాయకులతో ఆర్డీవో హరిప్రసాద్, తహసీల్దార్ రమాదేవి

టెట్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డీవైఈవో



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 27: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించనున్న కేంద్రాల్లో అభ్యర్థులకు మౌలిక వసతులు కల్పించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మస్తానయ్య, డీవైఈవో శ్రీరామ పురుషోత్తం తెలిపారు. మంగళవారం మదనపల్లె సమీపం లోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు నుంచి మార్చి 6వ తేదీ వరకు టెట్ నిర్వహిస్తారన్నారు. మదనపల్లెలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, కురబలకోట మండలంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో 100 మంది చొప్పున అభ్యర్థులకు టెట్ నిర్వహిస్తున్నామన్నారు. తొలిరోజున ఆదిత్య కళాశాల కేంద్రంలో ఉదయం 83 మంది, మధ్యాహ్నం 87 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు 50 నిమిషాల అదనపు సమయం ఇస్తున్నామని తెలిపారు. అనంతరం మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ జనార్దన్, ఎంఈవోలు రాజగోపాల్, ద్వారకనాథ్, బీటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, అధ్యాపకులు రాఘవరెడ్డి, డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 27: మండలంలో బార్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆర్థికసాయం అందించారు. మంగళవారం తన అనుచరులతో కోళ్లవారిపల్లెకు చేరుకుని ప్రమాదంలో మృతి చెందిన చంద్రయ్య, సుబ్రహ్మణ్యం ఆచారి కుటుంబసభ్యులను కలిసి సంతాపం తెలిపారు. అనంతరం ఒక్కొక్క రైతు కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రూరల్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, మహబూబ్‌పీర్, బయ్యారెడ్డి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రెడ్డిసాహెబ్ తదితరులు

మదనపల్లె: చీకలబైలు పంచాయతీ బూర్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు జనసేన మదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంగారపు స్వాతి ఆర్థిక సాయం అందచేశారు. మంగళవారం జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీనాథ్, తిలక్ ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఒక్కొక్క కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు. గంగారపు వెంకటనరేంద్ర, లవన్న, సరోజ, రూరల్ ప్రధాన కార్యదర్శి జంగాల గౌతం, పట్టణ ప్రధాన కార్యదర్శి గండికోట లోకేష్, ఉపాధ్యక్షులు కుమార్, జనార్దన్, రాజారెడ్డి పాల్గొన్నారు.



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జనసేన నేత గంగారపు స్వాతి